# కాలచక్రనేమి

చాలాకాలం క్రిందటి సంగతి... అబ్బో, అది చాలా మంచికాలం! మంచి లం అంటున్నానంటే ఏదో నోటినట్టాని కన్న మాట కాదు. అది నిజంగా మంచి కాలమనడానికి కారణమేమంటారా — అప్పుడు — నేటి మాదిరిగా బాంబుల భయమేలేదు! చిల్లరమల్లర బాంబులేమైనా వున్నప్పటికీ, అణుబాంబులూ, ఉదజని బాంబులూ లేవు...వేయేల; యిప్పటి ఆందోళనలు, భయాలు, బాధలు లేనేలేవు! అప్పుడే మన దేశంలో రైళ్లుపడుతున్నాయి, ఆంగ్ల ప్రభువుల చల్లని పరిపాలన బాగా వేళ్ళు పాతుకున్న రోజులనాటి సంగతి. కనుక ఆకాలం ఎంతమంచిదో వేరే చెప్పాలా? అప్పుడు...

—మా తాతయ్య అచ్చంగా యిలాగే, కథలు చెప్పి నట్టే— పాతకాలాలనాటి సంగతు లెన్నో చెబుతుండేవాడు. కథలు చెప్పినట్టే యేమిటి?—అచ్చంగా అవికథలే! మాతాతయ్య పేరు చెప్పకుండా నాస్వార్థంకొద్దీ 'ఆయనను మా తాతయ్య' గానే వ్యవహరించేనంటే— ఈజగన్నాటకంలో ఆయన పాత్రకు గల ఔచిత్యాన్నే భంగంచేసినవాణ్ణవుతాను. కారణమేమంటే ఆయన కాలంలో తాతయ్య పేరు చెబితే దిశలు తెల్లారేవి. మా తాతయ్య కేవలం 'చెన్నపరెడ్డి' లాంటివాడు కాదు, కాని ఒక రకమైన ఉద్దండుడనే చెప్పాలి! ఇంతెందుకు, ఆయన పేరు చెబితే మీాకే తెలుస్తుంది. ఇంత జనాభాలోనూ ఆయన పేరు ఏదోవిధంగా విన్న వాళ్ళే ఎక్కువమంది. వెనుక తరం వారిలో మరీ ఎక్కువ మందికి ఆయన ప్రభావం తెలుసు! నిజానికి శ్రీ సామవేదం-రామచంద్ర చక్రపాణిగారి పేరు వినని వారెవ్వరు? ఆయన ఖ్యాతికి ప్రకాశం కలిగింది ఒక్క విధమూ ఏమన్నానా? అన్నిటిలోకి తొలుదొల్త చెప్పుకోవలసిందేమంటే —క్రిందటి శతాబ్దంలో మన దేశాన్ని తన మేధాసంపదతో ఉర్రూతలూగించిన సామవేదం యజ్ఞేశ్వరశాస్త్రి గారి ఏకైక పుత్రుడు కావడమే!

—కనుక ఈసందర్భంలో మా తాతగారి తండ్రిగారి గురించి కొంతముచ్చటించుకోకపోతే, మా కుటుంబగౌరవానికి న్యాయం చేసినవాణ్ణికాను. యజ్ఞన్నగారు నాలుగువేదాలనూ...

క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మహా పండితుడు, న్యాయ తర్క-మీమాంసాది సకల శాస్త్రాల్లోనూ పారంగతుడు. అలాంటి మహానుభావుని కడుపున మా తాతయ్య అవతరించాడు. అందులోకీ, యజ్ఞేశ్వర శాస్త్రిగారి నలభయ్యో యేట ... ద్వితీయ కళత్రం కడుపు పండి, జన్మించాడాయన! యగ్గన్నగారి కీర్తి కేవలం పాండిత్య గరిమతో మాత్రమే శోభించినది కాదు. ఆయన తన ఏభయ్యో యేట చయనం చేసారు, ఏభయి మూడో యేట యజ్ఞం చేసారు; సోమయాజి బిరుదు పొందారు. తరువాత పౌండరీకం కూడా స్వయంగా చేసారు, ఏంచేస్తేనేం ఆయన నామధేయం మాత్రం యజ్ఞేశ్వర సోమయాజిగా మాత్రం స్థిరపడిపోయింది. అలాంటి మహనీయుని కడుపునపుట్టినందువల్లనే— మా తాతయ్య ఆగర్భ లబ్ధప్రతిష్ఠుడయ్యాడు. సోమయాజిగారు జ్యోతిష్యంలో కూడ మంచి దిట్ట కావడంవల్ల తనకు మా తాతయ్య ఒక్కడే సంతానంగా ఎరిగినవాడై, తన తండ్రిగారి పేరు మామగారి పేరు కూడా కలిపి కుమారుడికి 'రామచంద్ర చక్రపాణి' గా నామకరణం చేసారు.

—చిత్రం ఏమంటే— ఎందువల్లనో ఒక్కో పేరు మహా గొప్పగా రాణిస్తుంది! నామకరణం చేయబడ్డ సుముహూర్తపు బలంవల్లనో, లేక ఆ పేరులోని పదార్థాల విచిత్ర సమ్మేళనం వల్లనో తెలియదు కాని— కొన్ని పేర్లు రాణకెక్కడం మాత్రం నిజం! దీనికి తార్కాణం మా తాతయ్యకాక

మరొక రెందుకు ?

—నిజం చెప్పొద్దూ, మా తాతయ్య పండితపుత్రు డేమీ కాదు. మా ముత్తాతగారివంటి పండిత ప్రకాండుడు కాకపోవచ్చు గాక! అయితేనేం— ఆయన చదువుకున్నంత మేరలో గట్టివాడే! ఈ విషయం మా తాతయ్య కనక అభిమానంకొద్దీ నేను చెబుతున్నది కాదు. ఆయన పేరుతో పరిచయమున్న ఏ ఒక్కరూ నాతో విభేదించరు.

ఇంతకీ చమత్కారమేమంటే— అలాంటి సనాతన ధర్మ ప్రతిష్ఠాపకుడైన మా ముత్తాతగారింట్లో మా తాతయ్య ఖగోళవిద్యా విశారదుడెల్లా అవగలిగాడో నన్నదే! నా ధర్మ సందేహాన్ని ఒకనాడు మా తాతయ్యకే తెలిపాను. దానికాయన గమ్మత్తుగా నవ్వాడు. ఆయన నవ్వేపద్ధతి బలే తమాషాగా వుంటుంది! కొండ వెనుక చంద్రోదయంలాగ ఎంత ఉల్లాసం కలిగిస్తుందనీ! మా తాతయ్య నవ్వును ఈ విధంగా పోల్చుతున్నానంటే దానికి నాకాధారం లేకపోలేదు. ఎన్నోసార్లు ఈ రెంటికీ మధ్యగల సామ్యాన్ని త్రైపారువేసి చూశాను. నా పరిశీలనకు కారణమేమంటే...

—ఒకనాడు, పౌర్ణమి వెళ్ళగా మూడోరోజు యథాలాపంగా బీచికి బయల్దేరాను. ఎరిగున్న మిత్రులెవ్వరూ కనిపించలేదు. అకస్మాత్తుగా ఉదయం సరోజ చెప్పిన సంగతి గుర్తు

కొచ్చింది. గబగబా నడిచాను. డాల్ఫిను కొండకి పడమరగా ఒక బయలుంది...అందులో ఒక మామిడిచెట్టుంది. ఆ విషయాన్ని జ్ఞాపకం పెట్టుకుంటూ నడిచాను. అవును; సరీగా అక్కడికే సరోజ వస్తానంది. మాటయిచ్చిందంటే తిరిగిపోయే మనిషి కాదామె. అలాంటి చెడు అలవాట్లు ఆమెకెప్పుడూ లేవు. తప్పక వస్తుంది. మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాను. ఇంతలో తూర్పుదిక్కులో—డాల్ఫిను కొండ వెనుక నుంచి, ఏటవాలుగా వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి. కొండ తలమీది పాగాచుట్టు మెరుస్తోంది. ఆకాశంలో నావ రూపంగ ఉన్న మేఘశకలం ఉజ్జ్వలం కానారంభించింది. వెన్నెల కిరణాలు మరింత మీదికి, కొండ కొప్పుకి ఎగబ్రాకేయి. సగం చంద్రుడూ, అకసంస్మైన మెరసే మబ్బు నావా చూసేసరికి, నా మనస్సు పారవేసుకున్న దేన్నో వెదుకుతూన్నట్లు తోచింది. మరపు తెరపులమధ్య దేన్నో గాలించ నారంభించింది. హఠాత్తుగా దొరికింది, అచ్చంగా ఈదృశ్యంలాగే వుంటుంది—మా తాతయ్య నవ్వు!

—మా తాతయ్య నవ్వుగురించే మననం చేసుకుంటూ కూర్చున్నాను చంద్రరేఖలు లోకమంతటినీ ముంచెత్తుతున్నాయి. లోకం ధవళ ధగద్ధగలలో భాసిస్తోంది. సరోజ యింకా రాలేదేం చెప్మా? నాకేమీ పాలుపోవడం లేదు. ఏదో బెంగ గుండెల్ని పిండుతోంది. నాలో మరగుతున్న యవ్వనం

గర్జిస్తోంది. నా ఏకాకిత్వాన్ని గమనిస్తున్న శూన్యాటవి వంటి ప్రదేశం దద్దరిల్లుతోంది. కాని సరోజ రాలేదు. చాలా కోపం వచ్చేస్తోంది నాకు. ఆమె నిర్ధరించిన సమయం గడచిపోయింది. ఏం చెస్తాం, ఎందుకు రాలేదో? ఇంకా హాస్పిటల్‌నుంచి రానే లేదేమో! ఏదైనా ఆపరేషనుకు హాజరు కావలసివచ్చిందేమో! ఏమోనబ్బా. నర్సుల జీవితమే ఇచ్ఛిక బానిసత్వానికి చిహ్నం కాబోలు! ఏవేవో అనుకున్నాను ఎన్నెన్నో అనుకున్నాను. ఏం లాభం, సరోజ రానేలేదు. ఆసమయంలో లోకంలోని నర్సు లందరిపైనా విపరీతమైన దయాభిమానాలు పుట్టుకొచ్చాయి. ఇంక రాదని నిశ్చయించుకున్నాను. గృహోన్ముఖుడైన లేచే సరికి ఎనిమిదిన్నరైంది. తొందరగా నడుస్తున్నాను. రోడ్డెక్కాను. బజారులోకి వచ్చాను. హోటల్ రేడియోలు కమ్మని సంగీతం వెదజల్లుతున్నాయి. నాకు ఆకలి వేస్తున్న విషయాన్ని సంగీతం జ్ఞాపకం చేసింది. కొంచెం టీ త్రాగి పోదామనిహోటల్లోకి వెళ్ళాను. ఏదైనా తిందామనిపించింది. చెపాతీలు, కోడి కుర్మా తెప్పించుకున్నాను. తిన్నాను. టీ త్రాగాను. నడక సాగించాను వస్తాననిచెప్పి రానందుకు సరోజపై కోపం మండు తూనే వుంది.

—కాని పాపం, ఆమెకే బలమైన అభ్యంతరం వచ్చిందో మరి! ఇంతకీ చంద్రోదయాన్ని చూడగానే మా తాతయ్య నవ్వు జ్ఞాపకం వచ్చింది. ఇందులోగల కారణాన్ని తెలుకో

వాలని తీవ్రవాంఛ కలిగినందువల్లనే సరోజపై వచ్చినకోపం శాంతించింది. గబగబ నడిచి యిల్లుచేరుకున్నాను.

—మా తాతయ్య భోజనంచేసి వచ్చాడు. వీధివాకిట్లో మాలతీపందిరిక్రింద పడకకుర్చీలో భుక్తాయాసం తీర్చుకుంటూ కూర్చున్నాడు. సుఖంగా చుట్టకాలుస్తున్నాడు. మా తాతయ్య కుర్చీలో విశ్రాంతి తీసుకొనేపద్ధతీ, ఆసమయంలో చుట్టకాల్చే విధానమూ కుంచెతో చిత్రించవలసిన ప్రత్యేక శోభలు !

"ఏంరా, భోజనాని కింత ఆలస్యం చేశావేం ? నీకోసం యిప్పటిదాకా కూర్చుని, యిప్పుడే భోంచేశాను. లే, వెళ్లు, వెళ్లు! మాంచిపనిచేశావులే!" అన్నాడు తాతయ్య. ఇన్ని మాటలూ ఒక్కగుక్కలోనే అనేశాడు. సమాధానం వినకుండానే చుట్టనోట్లో పెట్టుకున్నాడు. నాకేసి కోరగాచూశాడు.

"లేదు తాతయ్యా! ఒక ఫ్రెండు డిన్నరుకు పిల్చాడు. చెప్పడం మరచిపోయాను. అంచాత ఆలస్యమైంది." అన్నాను. వట్టిది. అబద్ధంచెప్పాను. లేకపోతే భోంచేసిందాకా వదలడు. నాకాకలిలేదాయె! చంపుతాడు మరి!

—తాతయ్య పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్నాడు. తరచు అలాపరధ్యాన్నంగానే వుంటాడు. నేను కూడా ఆలోచిస్తున్నాను. ఐతే నామనసులో వున్నదల్లా ఒక్కటే!

తాతయ్యని ఎలా మాట్లాడించాలాఅని. మాటల్లోకి దింపాలి. అతని చేత నవ్వించాలి. అప్పుడుగాని పరిశీలనపూర్తి కాదు. నా కోరిక తీరదు. కనకనే, తలవనితలంపుగా తాతయ్య నొక ప్రశ్న వేశాను. నేనడిగే ప్రశ్న మా కుటుంబచరిత్ర కంతకీ మూలకంద మనికూడా నాకు తెలియకపోలేదు;

"ఏం తాతయ్యా! నిన్ను చాలరోజులనుంచి అడుగుదా మనుకుంటున్నాను; మీ నాన్నగారంతటి సనాతనధర్మ పరాయణులు కదా, నిన్ని యింగ్లీషు చదువులో ఎలా పెట్టారయ్యా?"...

నా ప్రశ్నవిని ఒక్కక్షణం తట పటాయించాడాయన. అప్పుడన్నాడు కదా, "ఇదేమిట్రోయ్! ఇప్పుడెందుకు జ్ఞాపకం వచ్చిందాసంగతి?...బాగానేవుంది." అని చిరునవ్వుతో ఈ వాక్యాల్ని ప్రారంభించాడు. క్రమంగా ఆయనమాట పూర్తయేసరికి ముఖమంతటా శుభ్రహాసచంద్రికలు ప్రసరించాయి. ఆయన నవ్వేపద్ధతే అది. నవ్వుతో నోరు తెరుచుకోక ముందే కత్తిరించిన తెల్లని మీసాలు, కాంతికళిక్కలై మెరుస్తాయి. తరువాత దట్టమైన కనుబొమలూ, క్రిముగా గండస్థలాలూ, కపోలాలూ—ఏదో కొత్త కాంతి సోకినట్టుగా ప్రకాశిస్తాయి. కనుకనే నేను కొండలవెనుక చంద్రోదయాన్ని పరిశీలిస్తుంటే మాతాతయ్య నవ్వే జ్ఞాపకం వస్తుంది. ఆవిధంగా నవ్వుతూ తన చిన్న తనపు మంచిరోజుల జ్ఞాపకాలకు వాక్యరూప మిస్తున్నాడు.

—మా తాతయ్య మేనమామ గారొకరు కుంఫెనీ వారిదగ్గర సిరద్దారుగా వుండేవారట!—తరువాత ఆయనే పిల్లనిచ్చిన మామగారయ్యారు. మరి కొన్నాళ్ళకి దుబాసీఅయ్యాడటకూడా! కనక అలాగే తన కొడుకుకూడా 'ఏసిరద్దారో, ఏ తాసిల్దారో, ఏ కలెక్టరో కావాలని, మా తాతమ్మగారు చిన్నప్పటినించీ పట్టుపట్టిందట. కనకనే యగ్గెన్న సోమయాజిగారు అంగీకరించక తప్పిందికాదు. అసలే ఆయన ఐహిక విషయాలపై శ్రద్ధాసక్తులున్న వాడుకాదు. ఆత్మోద్ధరణే ఆయనకెప్పుడూ ప్రధానచింతనం. పైగా 'నావిష్ణుః పృధ్వీపతిః' అనే ఆర్యోక్తిపై గాఢవిశ్వాసం ఉన్నవాడు కావడంవల్ల ఆంగ్లప్రభువులు కేవలమూ విష్ణ్వంశ సంభూతులేనని ఆయన త్రికరణశుద్ధిగా నమ్మారు. ఏమైతేనేం ఇన్ని కారణాలూ కలిసివచ్చాయి; మా తాతయ్యకూ ఆంగ్లవిద్య బాగావంటపట్టింది! ఆయన బి. ఎ. చదువుతూండగానే సోమయాజిగారు కాలంచేశారు. అచిరకాలంలోనే న్యాయపరీక్షకూడా ఉత్తీర్ణుడయ్యాడు మా తాతయ్య! ఇంగ్లండువెళ్ళి బారిష్టరుపరీక్ష కూడా ప్యాసైవద్దామనే, అసలాయనగారి ఆశ. సముద్రయానం—తమ వంశానికి నిషిద్ధమని వారించడానికి సోమయాజిగారు లేనేలేరు కదా... ఎటొచ్చీ ఉన్న అభ్యంతరమల్లా ఆస్తివిషయాలు కొంచం అస్తవ్యస్తం కావడం ఒక్కటే! కనకనే ఆ ప్రయత్నం మాని, కొన్నాళ్ళపాటు తన సొంతగ్రామంలోనే వుంటూ ఆస్తి చిక్కులు పరిష్కరించుకుందుకు నిశ్చయించుకున్నాడు...

—స్వగ్రామమైనా బొత్తిగా పల్లెటూరుకాదు; చిన్న రకం బస్తీయే. ఒక గొప్పఎస్టేటుకు ముఖ్యపట్టణం...అమెరికన్ బాప్టిస్టు మిషనువారు నెలకొల్పిన స్త్రీల ఆసుపత్రి...రెయిలు లాగే స్టేషనూ...గ్రామానికి సరిగ్గా పదిమైళ్ళ దూరంలో ప్రముఖమైన పెద్దనగరమూ...ఆరుమైళ్ళదూరంలో సముద్ర తీరమూ...ఇవీ మా తాతయ్య స్వగ్రామానికున్న నైసర్గిక శోభలు! అంతేగాక—కవిపండితుల విజ్ఞానసంపదా, ప్రాచీన కాలపు దేవాలయాల ఆధ్యాత్మిక సంప్రదాయమూ గ్రామాన్ని పుణ్యక్షేత్రంగా రూపుదిద్దిన జీవలక్షణాలు!...కనక మా తాతయ్యకా గ్రామంలో గడపడం ఖులాసాగానే వుంది...

—అప్పటికి నాలుగేళ్ళకు పూర్వమే, అంటే సోమ యాజిగారు బాగా ఆరోగ్యంగా మసలుతున్న రోజుల్లోనే మా తాతయ్యకి వివాహంజరిగింది. ఆస్తివ్యవహారాలు పరిష్క-రించుకునే నిమిత్తం స్వగ్రామంలో వుంటున్న సమయంలోనే, మా బామ్మగారికి తొలిచూలు పురిటిరోజులు వచ్చాయి. గర్భందాల్చిన నాటినుంచీ ఆమె ఏదోవిధమైన అనారోగ్యంగా ఉండేదట...ఎందుకైనా మంచిదని అమెరికన్ ఘోషాఆసుపత్రి ఆమెని చేర్పించాడు మా తాతయ్య. అలా చేర్పించిన రెండు నెలలకుగాని ఆమెకి పురుడేరాలేదు. ఈలోగానే జరిగింది, మా తాతయ్య జీవితమంతా వెలిగించిన అపరూప సంఘటన! అమెరికన్ లేడీ డాక్టర్ మిస్‌చార్లెటీడెయిజీతో ఆయనకి పరిచ

యం ఏర్పడింది. పరిచయం బాగా ముదిరింది; స్నేహంగా మారింది. స్నేహం ప్రణయ కలాపంగా కూడా పరిణామం పొందడానికి ఎంతో కాలం పట్టలేదు...

—ఆంగ్లవిద్యాసంస్కారం మా తాతయ్యలో ఎన్నో మార్పులు తెచ్చింది. ఆమార్పుల్లో ముఖ్యమైన దేమంటే— సామవేదం రామచంద్ర చక్రపాణిగా వున్న అంత పేరూ యస్. ఆర్. చక్రపాణిగా కుదించబడింది. దాన్నిక్రమంగా నలుగురూ పిలవడంవల్లనైతేనేం, చక్రపదంకూడా లుప్తమై యస్. ఆర్. పాణిగా మాత్రమే రూపొందింది.

—మా తాతయ్య సామాన్యమైనవ్యక్తి కాదన్న సంగతి ముందే మనవి చేసుకున్నాను. ఆయన ఎంత తెలివైనవాడో, అంతకుమించిన అందగాడు. ఆరడుగులు దాటిన దృఢతర దేహ యష్టికలవాడు... ఎర్రగా మెరిసే శరీర కాంతీ, చక్కగా వుంగరాలు తిరిగిన గిరిజాలతలకట్టు...దానికి దీటుగా సన్నగా నాజూకుతో మెరిసే మీసకట్టూ...నిజంచెప్పొద్దూ—మా తాతయ్య మహా అందగాడు! డెబ్బది నాలుగేళ్ళ వయసు వాడూ, ఇప్పటికైనాసరే— ఆయన్ని మొదటిసారి చూసిన వ్యక్తి చప్పున చూపు మరల్చుకోలేడు. ఇంతెందుకు—ఆమె... ఆ లేడీడాక్టర్ మిస్ జెయిజీగారు—"ఓమైడియర్ హెర్క్యులస్!" అని సంబోధించేదట. ఆమెని ఈయన కూడా హెలెన్ అనీ, వీనస్ అనీ, అహల్య అనీ, ఊర్వసి అనీ ఇలాగే ప్రపంచం

లోని సౌందర్యవంతుల పేర్లన్నీ పరస్పరం ఉపయోగిస్తూండే వారట...ఏమైతేనేం—మా తాతయ్యని ఆ పరదేశీ వనిత, మన దేశాన్ని తన దయామృతమిచ్చి ఉద్ధరిస్తున్నానని గర్వించే వ్యక్తి అంత హృద్యంగా పిలుచుకోనేదంటే—మా తాతయ్య మహత్తు వ్యక్తంకావడంలేదూ?

—ఇంత ముసలితనంలోకూడా ఎందుకో యిలాంటి స్వంత విషయాలను నాతో చెప్పడానికి సందేహించేవాడు కాదు పైగా అన్నీ తెలిసినమిత్రునితో మాదిరి, ఎంతో ఆప్యాయంతో చెప్పుతూండేవాడు. ఒకనాడు మా మామూలు బాతాఖానీ ఏదో అనేక విషయాలపై సాగిపోతోంది. గబుక్కున లేచి వెళ్లి నిలువుటద్దం ముందునించున్నాడు. అద్దంలో చూసుకుంటూ జుత్తు సవరించుకున్నాడు. నా వెంపుకుతిరిగి, యథాస్థానంలోకి వస్తూ, ''ఒరే, రమా! నా శరీరసౌందర్యం నా జీవిత విజయానికి ఎన్నో విధాల దోహదం చేసిందిరా!'' అన్నాడు. ఆమాట మాత్రం చాలా బింకంతో అన్నాడు. ఆయన సొంతవిషయాలేమైనా నాతో చెప్పుకోనేటపుడు కొంచెం ఉద్రేకపడేమాట వాస్తవమే...కాని అతిశయోక్తులు అసత్యాలూమాత్రం ఎప్పుడూ దగ్గరకు రానిచ్చేవాడుకాదు. అసలు మా తాతయ్యకి స్వోత్కర్ష అన్నా, కీర్తికండూతిఅన్నా సహజంగానే అసహ్యముండేది.

—నా పుట్టుకనాటి సంగతి మా అమ్మ ఒకసారి చెప్పింది. మా తాతయ్య దగ్గర మా అమ్మ, కూతురులా చనువుగా వుండేదట. ఒకనాడామె మా తాతయ్య దగ్గరకి నన్నెత్తుకుని వచ్చి "బాబుకి మీ పేరే పెడదామండీ!" అన్నదట. వెంటనే ఆయన "అబ్బే–వద్దు...వద్దు! వాడికి 'రమారంజనశర్మ' అని పెట్టాలని ఇదివరకే నిర్ణయించాను" అన్నాడట. ప్రతీ చిన్న విషయమూయింతే...చిన్న సంగతినైనా బాగా ఆలోచించి నిర్ణయానికి రావడం ఆయన స్వభావం. కనుకనే మా కుటుంబం అందరికీ మా తాతయ్యపై అంతవిశ్వాసం ఉందిమరి!

—చూశారా ? తాతయ్యను గురించి అతి ముఖ్యమైన సంగతులు చెబుతూ దారితప్పాను. అవునుమరి! మా తాతయ్య కున్నంతటి మేధాశక్తి నాకుంటేనా? వర్తమానంనుంచి ఆలోచనాత్మకంగా పరామర్శించి భవిష్యత్తును బంధించే ప్రజ్ఞ ఆయనకుంటే, గతాన్నీ వర్తమానాన్నీ కలగాపులగంచేసే తెలివి మనది! ఏంచేస్తాం? సరే...

మా పెద్ద మేనత్తగారిని ప్రసవించిన నెల్లాళ్ళవరకూ మా బామ్మగారు ఆసుపత్రిలోనే వున్నదట. ఆమె ఆసుపత్రి నుంచి విడుదలై యింటికి వచ్చినా మా తాతయ్య మాత్రం లేడీ డాక్టర్ గారినుంచి విడుదలకాలేదు. వాళ్ళిద్దరికీ మనసు కలిసిన ముహూర్తబలం అలాంటిది కాబోలు!

— ఎంత బలమైనదీ కాకపోతే, ఆశ్చర్యకరంగా మా కుటుంబ చరిత్రనే తారుమారు చేయగల్గుతుంధీ మరి!

—ఆవిధంగా లేడీడాక్టర్ మిస్. జెయిజీకీ మాతాతయ్యకీ ఈ ప్రణయ సంబంధం గాఢతరంగా వ్యాపించింది. కాని మా బామ్మగారికి మాత్రం ఆవిధమైన అనుమానమే ఉండేదికాదు. ఒకవేళ అనుమానం వున్నా దాన్ని అధికంచేసుకొని జీవితం దుఃఖభాజనం చేసుకోలేరేమో! పైగా 'డాక్టరమ్మ'ని కేవలం తన ప్రాణప్రదాతగా, దేవతగా ఎంచుకునేదటామె. కనకనే మాతాతయ్య అప్పటికే కాలధర్మంచెందిన తన తల్లిగారి పేరున సీతాకుమారి అని, పెట్టుకుందామంటే, మా బామ్మగారు మాత్రం డాక్టరమ్మ పేరు పెడదామని పట్టుపట్టిందట. ఏమైతే నేం, మొత్తానికి మా మేనత్త పేరు సీతాకుమారి జెయిజీ అని రూపొందింది. లేడీడాక్టర్ ఎంతో మంచిదనీ, రోగుల్ని కన్న తల్లిగా కాపాడుతుందనీ, ఆమె ఈ ఆసుపత్రికి సూపర్నెంటుగా వచ్చిన నాటినుంచీ పేరు ప్రతిష్టలు సంపాదించుకుంది. ఆమె ఎంతో భక్తి విశ్వాసాలతో తన మత కార్యకలాపాలు సాగి స్తూండేది. ఆమె వ్యక్తిగతసలక్షణాలు జనసామాన్యాన్ని బాగా ఆకర్షించాయి. పైన మా తాతయ్యకి ఆమెఅంటే పంచ ప్రాణాలున్నూ! ఏ కారణంవల్లనైతేనేం, తాను సముపార్జిం చుకున్న విద్యా సంస్కారాల ఫలితంగా స్వమతంపై విశ్వా సం సడలడంవల్లనైతేనేం— మొత్తానికి 1901వ సంవత్సరం

మార్చి 13వ తేదీని మా తాతయ్య సకుటుంబంగా క్రిస్టియను మతాన్ని స్వీకరించాడు. ఒక ఫలితం జరిగింది అంటే ఏదో ఒకే కారణం ఉంటుందనుకోవడం స్థూలదృష్టికి సబబుగా కనిపిస్తుందికాని, సూక్ష్మ పరిశీలనకు తద్భిన్నంగా గోచరమవుతుంది. కారణా లేమైనప్పటికీ ఈ సంఘటన మాత్రం మా కుటుంబ చరిత్రలో అతి విశిష్టమైనది. మా వంశచరిత్రలో యింతటి చిరస్మరణీయమైన సన్నివేశం మరోటిలేదు. ఏమంటే వేలాది వర్షాల కాలవాహినిలో హైందవ ధర్మపరాయణుల వంశనియని భారత పుణ్యభూమిని పేరు ప్రఖ్యాతి నార్జించిన కుటుంబంమాది. సామవేదంవారంటే సదాచార బ్రాహ్మణ కులీనులన్నది దేశమంతటికీ తెలుసు. అలాంటి కుటుంబాన్ని—హైందవ ధర్మంనుంచి—ఆ సంవత్సరం మా తాతయ్య 'పతనం' కావించాడు! కనకనే మా స్వగ్రామంలోని మా బంధుకోటీ, మిగిలిన బ్రాహ్మణ్యమూ ముక్కులపై వ్రేళ్ళు వేసుకున్నారు. అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకున్నారు. "ఎలాంటి మహానీయుడి కడుపున ఎలాంటి కుక్కమూతి పింది పుట్టిందీ!" అంటూ తమ అసమ్మతిని ప్రకటించారు. గ్రామ సభాపతిగారి యాజమాన్యాన బ్రాహ్మణసంఘం సమావేశమైంది. చక్రపాణిగారి కుటుంబాన్ని కులంలోంచి వెలివేశారు. తాత తాతలనాటి నుంచీ వారసత్వంగా సంక్రమిస్తూ ఆఖరికి మా తాతయ్య హక్కుభుక్తంలో వుంటున్న యింటెని సైతం ఖాళీచేసి వెళ్ళి

పోవాలని శాసించారు. సనాతన బ్రాహ్మణ కుటుంబాలమధ్య కిరస్తానీ కులభ్రష్టుడు ఉండటం తమకు శ్రేయస్కరం కాదన్నారు. పోరు లావైపోయింది.

—కాని, మాతాతయ్య అంతకన్నా పెంకివాడు. న్యాయశాస్త్ర రీత్యా తన్ను కదపడానికి ఎవరికీ హక్కులేదన్నాడు. అలాగే మొండిగా పేచీపెట్టి ఒక రెండేళ్ళపాటు ఆయింట్లోనే వున్నాడు. ఇరుగు పొరుగుల సామాజికులు తన కుటుంబాన్ని అంత నీచంగా చూస్తూంటే ఆపరిసరాల మధ్య బ్రతకడం కష్టమే మరి!

—అన్నిటికన్నా విచిత్రమైన సంగతేమిటంటే—మా బామ్మగారు కూడా మాతాతయ్యతో కలసి క్రిస్టియన్ మతం తీసుకోవడానికి ఏవిధమైన అభ్యంతరం పెట్టకపోవడమే! వాళ్ళ తండ్రిగారు కంపెనీవారిదగ్గర దుబాసీగానే ఉద్యోగం చేయవచ్చు గాక. ఆయన ఆహ్వానంతో అనేక మార్లు కిరస్తానీ దొరలు—ఆంగ్ల ప్రభుత్వాధికారులు తమయింటికి వచ్చి విందులు సేవించ వచ్చు కాక! తెలుగు బొబ్బట్లూ, ఆవకాయలూ, పిండి వంటలూ వాళ్ళకి కొత్తరుచులు చూపించవచ్చు కాక! అలాంటి సన్నివేశాలు వల్ల మాబామ్మకి కూడా దొరలన్నా, వారి మతమన్నా సహిష్ణుత ఏర్పడి వుండవచ్చు కాక!—అంత మాత్రంలో భర్తతో కలిసి కిరస్తానీ మతం స్వీకరించ

డానికి ఎలా అంగీకరించిందా అన్నది సమస్యే! ఆంగ్ల ప్రభు వుల్లతో ఎంత సంబంధం వున్నా ఆమె పుట్టింటివారి కుటుంబం, నాటికీ నేటికీ కిరస్తానీమతం పుచ్చుకుండా ఏమన్నా నా? ఎలాంటి పరిస్థితులు వత్తిడి చేసినప్పటికీ, భర్తతోపాటు భార్యకీ, అందులోకీ సామాన్య కుల కాంతకి, అంతటి సంస్కరణదృష్టి వచ్చిందంటే అబ్బురం కాదూ? అందులోనూ "స్వధర్మం వదలి పరధర్మం చేపట్టేటంతటి మతసంస్కరణ కలగటం వినాశన సూచన గాక మరేమిటి?" ఆ కారణంతో తోటి బ్రాహ్మలంతా మరింత నిగ్గుతీసేవారు. కాని ఒక్కటి మాత్రం నిజం—మా బామ్మగారికి మాత్రం డాక్టరమ్మంటే ఎంతో ప్రేమాభి మానాల్సు, గౌరవాదరణలు ఉండేవన్న మాటలో సందేహం లేదు.

—లేడీ డాక్టరుగారిపై మా బామ్మకి గల గౌరవమూ, మా తాతయ్యకి గల ప్రేమా కలసి మొత్తానికి ఐక్యంగా కిరస్తానీ మతం తీసుకోవడానికి సహాయపడి వుండవచ్చు. అందులోకీ—మా తాతయ్యకీ మిస్. డెయిజీకి కలసిన ప్రేమబంధం ఎంత యిద్దరిదని! ఒకేవూళ్ళో — ఒకటి రెండు మైళ్ళ దూరంలో వాళ్ళిద్దరూ ఉండేవారా, అయినా ఉత్తర ప్రత్యుత్తరాల్సు నడవని రోజంటూ వుండేదే కాదట. ఆయన ప్రేమలో మజా ఎంతటిదో కాని క్రమంగా ఆమె వృత్తికి సంబంధించిన కార్య కలాపాలే సన్నగిల్లిపోతూ యుట!... రంకుతనం దొంగతనం

ఎంతకాలం ఛాగుతుంది? అందులోకి ఆమె క్రిష్టియన్ మిషనకు సంబంధించిన బ్రహ్మచారిణి కూడానాయె! 'బ్రిహచారిణి' అని అంటున్నానంటే అవివాహిత అని మాత్రమే రూఢ్యర్థం. పైగా ఒక సంస్థకు బాధ్యత గల స్థానంలో ఉన్నదామె. కనుకనే రిపోర్టులు వెళ్ళాయోఏమిటోగాని, మాతాతయ్య ప్రణయంతో రెండుసంవత్సరాలయినా! పూర్తిగా—ఆనందసాగరంలో ఈదులాడకుండానే, ప్రళయం ఎదురైంది. అమెరికానుంచి ఆమెకి వర్తమానమందింది. మిషను అధికారులు ఆమెని బాధ్యత గల స్థానం నుంచి తొలగించడమేగాక, దేశప్రతిష్టకీ—మతగౌరవానికీ భంగకరంగా ప్రవర్తిస్తున్నదనే కారణంతో ఆమెని స్వదేశానికి రమ్మని ఉత్తరువిచ్చారు. దానితో మాతాతయ్యకీ, ఆమెకీ కూడ హృదయాఘాతమైంది.

— యమాజ్ఞవంటి ఈఉత్తర్వులను తప్పించుకోవడమెలాగ? కనకనే డాక్టర్ డెయిజీ ప్రయాణసన్నాహాలు చేసుకోనారంభించింది. ఒకనాడు మాయింటికి వచ్చి మా తాతయ్యతో చాలాసేపు మాట్లాడిందట. మా బామ్మగారి దగ్గరకు వెళ్ళి "అమ్మా మిమ్మల్నందర్నీ విడిచి వెళ్ళిపోతున్నానమ్మా" అందట యాస తెలుగులో. అంటూమాబామ్మని కౌగలించుకొని వెక్కి వెక్కి ఏడ్చిందట. మరునాడు మళ్ళీ మాయింటికి వచ్చి మాబామ్మగారికీ పసిబిడ్డకీ వెండి బంగారు వస్తువుల బహూమతులిచ్చిందట. మాతాతయ్యను కలుసుకొని

ఇరవై వేల రూపాయల బాంకుచెక్కును చేతిలో పెట్టిందట! మా తాతయ్య ఎంత బలవంతం చేసినా 'తీసుకోక పోతే ఆత్మ హత్య చేసుకు చచ్చిపోతా'నందట! తనను సుఖంగా తన దేశానికి పంపాలని వుంటే తీసుకో మందట ... తీసుకోకపోతే ఏం చేస్తాడు తాతయ్య? ఈబహుమానాలన్నిటికి ప్రతిఫలంగా మా తాతయ్య బొమ్మగార్తో, తీయించుకొన్న ఫొటో ఒకటే, మా తాతయ్య కట్టుకునే పంచ, ఉత్తరీయం, లాల్చీ మాత్రం తాను తీసుకుందట! ...ఆమె స్వదేశం వెళ్ళిపోతున్న రోజున మాత్రం—స్టేషనులో మా తాతయ్యని కౌగలించుకొని ఎంత గానో ఏడ్చిందట పాపం! ఈ సంఘటనమాత్రం వూరిలోని అశేషజనానికి తేటతెల్లంచేసింది.

—ఏమైతేనేం—డాక్టరుగారి సంస్పర్శం వల్ల మాకుటుంబానికి ఆర్థికంగా లాభమేకలిగింది. నగదురూపంగా గాని, వస్తు వాహనాల రూపంగాగాని, అమూం బాపతులు పాతికవేల రూపాయలు అయివేజు ముట్టచెప్పి మరీ వెళ్ళిందా పుణ్యాత్మురాలు! కనకనే మా తాతయ్య; "ఒరే రమా! ఆరోజుల్లో పాతికవేలంటే మాటలటోయ్? ఇప్పుడు రెండు లక్షలకి సమానం తెలుసా?" అన్నాడు నాతో. ఆవిషయం నాకూ తెలుసు. అయినా ఆయన చెప్పాడు; నేను విన్నాను. అంతే! మా తాతయ్య చెప్పడంలోకాని, నేను వినడంలోగాని ఉన్న సమాన ధర్మమల్లా ఆనందం మాత్రమే.

లేడీ డాక్టర్ గారు అలా స్వదేశానికి వెళ్ళిందో లేదో ఋలా ప్రారంభమయ్యాయి, గ్రామంలో వ్యాఖ్యానాలు— "అమ్మగారు చేసిందే కనక ఈమాటు అయ్యగారి తెగులు చప్పగా కుదురుతుందిలే!" అని. మా తాతయ్య తెచ్చిన మార్పును ద్వేషిస్తున్నవారంతా ఎందుకో చాలా సంతోషించారట! మా కుటుంబాని కామె కావించిన మేలు ఎవరికీ తెలియ లేదు కాబోలు!

మా తాతయ్య తన పేరును "యస్.ఆర్. పాణి" అనే హ్రస్వరూపంతో వ్యవహరించుకుంటూ వచ్చాడని లోగడనే మనవిచేశాను. అవసర మొచ్చినప్పుడల్లా తెలుగులో కూడ 'సా. రా. పాణి' అనే కుదింపు పేరుతో వ్యవహరించడంకూడా కద్దు. అయితే తన పేరుని విధంగా కుదించడానికీ, డాక్టర్ డెయిజీగారి స్నేహంతో బ్రాందీ విస్కీల కలవాటు పడ్డానికీ ఏదో అంతరంగ సంబంధం వుంటుందని పరిశీలకులు అనుమానించడానికి ఆధారాలు లేకపోలేదు. అయితే అంత సూటిగా ఈ రెంటికీ సంబంధం ఉందా లేదా అని మా తాతయ్యను ప్రశ్నించే ధైర్యం మాత్రం నాకు లేక పోయింది! మొత్తాని కామె సంపర్కంతో ఏర్పడ్డ ఈ వ్యసనం మాత్రం అతని జీవితాంతమూ తొలగి పోలేదు. అంతేగాక, ప్రత్యక్షంగా ఆమె కారణభూతురాలైందో లేదో తెలియదు కాని—మా కుటుంబా

నికి సంభవించిన కిరస్తానీ మతం మాత్రం మావంశ మున్నంత కాలం తొలగిపోదనుకుంటాను.

—ఇంతటి చరిత్రాత్మక పరివర్తనానికి కారణం మహనీయుడు మా తాతయ్య కనక ఆవిడ కథకు సంబంధించిన పూర్వోత్తరాలూ, మా వంశ చరిత్రా—చెప్పవలసివస్తే మహాభారత మంతటి గ్రంథమవుతుంది. అంత భారాన్ని వహించే శక్తి నా కిప్పట్లో లేదు. కాబట్టి మా తాతయ్య ఉత్తర జీవితానికి సంబంధించిన రెండు విషయాలు చెప్పి దీన్ని ముగిస్తాను.

—ఇంక ఆవూళ్ళో వుండటం మహాకష్టమై పోయిందా యనికి. డాక్టరమ్మ వెళ్ళిపోయిన కొద్ది రోజులకే స్వగ్రామంలో వున్న భూమి పుట్రా వగైరా అన్నిటినీ అమ్మేసి నగదు చేసుకున్నాడు తాతయ్య. పైగా—చదువుకున్న వాడు. బోలెడు అవకాశాలున్న వాడూ, నిర్వ్యాపారంగా కాలం గడపడం కష్టం కదా? అయినా ప్రభుత్వంలో తన మేనమామలకి, బావమురదులకీ కావలసినంత పలుకుబడి వుంది. అవకాశాలుపయోగించుకుని గొప్పఉద్యోగం సంపాదించుకోవచ్చు అదీకాక తనకి లా ప్రాక్టీసు పెడదామనే మొదట్నించీ కుతూహలం వుండేది. కాని కావలసిన వాళ్ళంతా ఉద్యోగమే మంచిదని సలహా యిచ్చారట. తీరా ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించే సరికి, లేడీ డాక్టరుతో గల సంపర్కం మొదట్లో కొంచం అభ్యంతరమైనా

చివరకేమీ కష్టం కలిగించలేదు. చేతిలో వున్న డబ్బూ దస్కం ఖర్చయి పోతుందేమో నన్న భయంతో విశాఖపట్నంలో గొప్ప యిల్లొకటికొనేసి మరీ ఉద్యోగంలో ప్రవేశించాడు తాతయ్య. పాతికేళ్లు దాటిపోయినా ఆయన విషయం ప్రత్యేక దృష్టితో పరికించి నేరుగా డిప్యూటీ కలెక్టరుగానే నియమించ బడ్డాడట!

అయితే ఉద్యోగం ఏవిధంగా చెలాయించాడో, ఏ మార్జించాడో వంటి వివరాలతో మనకొస్తే ప్రసక్తి లేదు. పుట్టిన నాటినుంచీ ఠీవి, దర్పం, హుందాతనం ముప్పేనగొన్న వ్యక్తిత్వమాయనది. ఉద్యోగం చేసినన్నాళ్ళూ గొప్ప పంచ కళ్యాణీ గుర్రాల మీదనే ప్రయాణాలు చేసేవాడట. అంత రాజసం ఉండేడతనిలో! మొత్తానికి మా తాతయ్యగారి ఉద్యోగపర్వం మాత్రం చేతిచమురు భాగవతంగానే తయారై ఉంటుందని ఫలితాలనుబట్టి అర్థమవుతుంది.

నే నెప్పటికీ మరచిపోలేను. ఆవేళ నవంబరు పద్దెనిమిదో తేదీ. కార్తీకమాసపు చలివేళలు నాళ నాళాల్నీ కుదిపేస్తు న్నాయి. బ్రతుకు పొలిమేరలవరకూ కట్టి కుదుపుతున్నాయి. అలాంటిదావేళ. అంత వయసులో తెల్లవారకట్టే లేచి అభ్యం గనం చేశాడు మా తాతయ్య. కొత్తబట్టలు కట్టుకొన్నాడు. కొత్త పెళ్ళికొడుకులాగ తయారయ్యాడు. నేను లేచేసరికే

చెర్చికి వెళ్ళి ప్రార్థనచేసి వచ్చాడు. కాఫీ, టిఫిను తీసు-కొన్నాడు. పడకకుర్చీలో శుద్ధిగా కూర్చున్నాడు. భగవద్గీత చదువుకుంటున్నాడు. అప్పటికి లేచాను నేను. డ్రాయింగు రూములోకి వెళ్ళి చూశాను. మా తాతయ్య దేదీప్య మానంగా వెలిగిపోతున్నాడు. ఎంతో వర్చస్సుతో చూడ ముచ్చటగా వుందాయన ముఖం. నూత్న తేజస్సుతో ప్రకా సిస్తోంది. ఆయన్ని చూస్తే నాలో చిత్రాతిచిత్రమైన అను భూతులేవో పొంగులువార నారంభించాయి. ధ్యానమగ్నుడై ఉన్నాడుకదా అని నేను కాలకృత్యాలు తీర్చుకుందుకు వెళ్ళి పోయాను. కాఫీ పుచ్చుకోవడంకూడా పూర్తిచేసి తాతయ్య గదిలోకి వెళ్ళాను. అప్పటికి భగవద్గీతా పారాయణ పూర్త యింది. తొలినాటి దినపత్రిక చూస్తున్నాడు. ఆలోచిస్తు న్నాడు. ఆయన ముఖాన్ని భక్తిగాచూస్తూ ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాను. సాలోచనగా చూస్తున్నాను. తటా పటాయించి ఆఖరికి అడిగాను, "ఏం తాతయ్యా! ఈవేళ చాలా కొత్తగా వున్నావు— నీ పుట్టినరోజు పండగా?" అని ముఖం పరిశీలిస్తున్నాను!

నా వేంపుకు సౌమ్యంగా దృష్టి సారించాడు. చేతిలోని పేపరు, ప్రక్కనున్న టీపాయిమీద పెట్టాడు. సులోచనాలు తీసి తీవిగా కేసులో పెట్టేశాడు; "కాదురా బాబు! ఈవేళ

నా పుట్టినరోజు కాదు. కాని నాకు మూడు పుట్టినరోజులు ! అందులో ఈవేళో ముఖ్యమైనరోజు...'' అన్నాడు. చిరు నవ్వు వెలుగులు కురిపిస్తూ—

మా తాతయ్య చెప్పవలసింది పూర్తి చేసేదాకా అడ్డు ప్రశ్నలు వేయడం నా కలవాటులేదు. చెప్పవలసిందంతా ఒక్క గుక్కలో చెప్పేశాడు. ఆగాడు. ధోవతి కుచ్చెళ్ళు సవ రించుకొన్నాడు. అప్పుడడిగాను, ''మూడు పుట్టినరోజు లేమిటి తాతయ్యా?'' అని అనుమానిస్తూనే అడిగాను. అతను చెప్పుకొస్తున్నాడు.

ఆయన ఈ భూమిపై అవతరించినరోజే మొదటి పుట్టిన రోజు. ఆఉత్సవం శ్రావణ పౌర్ణమినాడు జరుపుకుంటాడు. రెండవ పండుగ ఈరోజే ! ఈ రోజుకింత ప్రాధాన్య మెందు కిస్తున్నాడా అనుకొన్నాను. తాతయ్య చెప్పిన ప్రకారం ఈ దినాన్నే మొదటిసారిగా అమెరికన్ లేడీ డాక్టర్ డెయిజీతో సమాగం కలిగినదట ! ఆవిషయం చెపుతున్నపుడు తాతయ్య నయనాలు ఆషాఢ మేఘాలయ్యాయి. కపోలాలు ఆర్ద్రాలయ్యాయి. హృదయం సంక్షుభితమయింది. మూడవది తాను సకుటుంబంగా క్రిస్టియన్ మతం స్వీకరించిన మార్చి 13వ తేదీ. అవి మూడూ తన జీవితంలో ప్రముఖమైన దినాలని ఆయన చెప్పాడు. ఆవును మరి. అందులో సత్య దూరత ఏముంది? ఆమూడు దినాలూ చిరస్మరణీయమైనవే. ఆయన

మనసు బరువుగా వున్న సంగతి ముఖం చెబుతోంది. చెమ్మ గిల్లిన కన్నులు ఉత్తరీయంతో తుడుచుకొన్నాడు. ముఖాన్ని నిర్లిప్తంగా మార్చాడు. హఠాత్తుగా నా వేపుకు తిరిగి ... "బాబూ! నీవీవేళ ఎక్కడికి వెళ్ళకురా! పనివుంది" అన్నాడు మళ్ళీ చూపులు దూరపు లోకాలకు ప్రసరింప చేసాడు.

అలాగేనన్నాను. తాతయ్యకెప్పుడూ ఎదురు చెప్పలేదు నేను. ఇంక నేనేమీ మాట్లాడలేదు. ఆయన కూడా మాట్లాడ్డంలేదు. నన్ను చిన్నతనంనుంచీ తాతయ్యే పెంచాడు ఆయన దగ్గర నాకెంతో చనువు కూడా వుంది. అయితే ఆ చనువును కొన్ని నియమితమైన అవధుల్లోనే ఆయననాకిచ్చాడు. కనక ఎంత చనవో అంత భయమూ వుంది. నాకాయన మీదగల గౌరవభావాన్ని భయం అనడం పొరబాటే. నా భావాన్ని భక్తి అంత కన్నా బరువైన మరేదైనా మాటో వ్యక్తీకరించ కల్గుతుందనుకుంటాను. మూగగా ఆలోచించుకుంటున్నాను. ఆయన ఉబ్బెత్తుగా లేచాడు. "చూచావా?" అన్నాడు. నేను సమాధానం చెప్పలేదు. తొందరగా బీరువా దగ్గరగా వెళ్ళాడు. తలుపు తెరిచాడు.

అందులో ఒక అరలో విలువైన బట్టలన్నీ వున్నాయి. మరో అరలో నిత్యం వాడుకునే బట్టలన్నీ వున్నాయి. మూడో అరలో ఏవో ముఖ్యమైన పుస్తకాలూ, డైరీలూ — అట్టల మీది గిల్టు అక్షరాలైనా మాయకుండా తళతళలాడుతూ

మెరుస్తున్నాయి. మరో అరలో చెక్కసందుగా పెట్టె వుంది. దాని ప్రక్కనే వెండి బంగారు సామాన్లున్నాయి. నగిషీలతలు చెక్కిన చిన్న చందనపు పెట్టెకూడా వుంది. రెండు మూడు అందమైన సీసాలున్నాయి. కొంచెం పెద్దదిగా వున్న చెక్కసందుగా పెట్టెలో రొక్కం దాచుకొంటాడేమోననుకున్నాను. ఆ పెట్టె తెచ్చి నా ముందున్న బల్లమీదుంచాడు. మూత తెరిచాడు. తీరాచూద్దునుకదా, ఆశ్చర్యం! అందులో పొందిగ్గా అమర్చిన ఉత్తరాలెన్నో వున్నాయి. అవన్నీ ఒకే దస్తూరీతో వున్నాయి. "ఇది చివరి ఉత్తరం! చూడు..." అన్నాడు ఆప్యాయంగా తాతయ్య!

ఆ ఉత్తరం ఆయన చేతిలో వుండగానే, చూసీ చూడనట్టుగా చూస్తున్నాను, చిరు సిగ్గులతో సందేహిస్తున్నాను. "ఫరవాలేదురా! చూడు బాబూ!" అన్నాడు తాతయ్య. ఈ మాటలు మరింత మార్దవంగా నా చెవుల్లో అమృతం చిందించాయి. మనసు దిటవు చేసుకున్నాను. చేతిలోకి తీసుకున్నాను. కాని ఎందువల్లనో చేతుల వొణుకు పోనేలేదు... ఆ ఉత్తరం 1940 సం॥ నవంబరు 18ని వ్రాసినది. అమెరికాలోని పెన్సెన్స్ వాలీనుంచి మిస్. డెయిజీ వ్రాశారు. "మై డియరెస్టు కింగ్ ఆఫ్ క్యూపిడ్స్!" అనే సంబోధనతో ప్రారంభమై వుంది.

ఆ లేఖలో వ్యక్తీకరింపబడ్డ భావోన్నత్యమూ, ప్రేమాగ్ని, ఆవేశమూ, కళా సౌందర్యమూ— నన్ను చకితుణ్ణి చేశాయి. ఆ ముసలి ప్రేమికుల హృదయాలలో సతతం ప్రజ్వలించే ఆ తీవ్ర జ్వాలలను నా హృదయంతో తాక డానికే భయంవేసింది. నాలో కలిగిన అలజడినుంచి తప్పుకో లేక పోయాను. సొంతం చదువనే లేకపోయాను. నిజానికి ఈ లేఖలు ఏ సారస్వతంకైనా వెలుగునిస్తాయనుకున్నాను. తత్పూర్వం మా తాతయ్య ఓలేఖ రాశాడట. అందులో— డెయిజీ తన హృదయంలో వాడని సువాసనల వెదజల్లే స్వర్గ లోక కుసుమమనీ, ఆమె స్మృతి తన హృదయపు పర్వతసాను వుల్లో గాలిలో విలీనమయ్యే సున్నితమైన సంగీతాన్ని ఎప్పుడూ నింపుతూ వుంటుందనీ, ఆ సంగీత తరంగాలు, విశ్వవాణిగా పరివర్తన మవుతున్నవనీ— ఏదేదో రాశాడట! ఆవాక్యాన్ని ఆమె ఈ లేఖలో ఉల్లేఖించింది. దానిపై తన వ్యాఖ్యానం యిచ్చింది. తన ప్రణయ సామ్రాజ్యానికి మా తాతయ్యే ఏకైక చక్రవర్తి అనీ; ఆ సామ్రాట్టు దివ్యపాదాలవద్ద పడి వుండవలసిన సేవకురాలు తాననీ— సర్వ సమర్పణంగా ఆమె చెప్పుకున్నది. అబ్బా! వాళ్ళ ప్రణయకలాపం చూస్తే నా కెంతో ఆనందం కలిగింది. సిగ్గుకూడా వేసింది. వారి హృద యాల్లో మరిగే ప్రణయ మరంద సౌరభం నన్నొకసారిగా మత్తెక్కించింది. తాతయ్యకా లేఖ తిరిగి ఇచ్చాను. చెక్క—

పెట్టెలో ఒకే ప్రక్కనున్న కవర్లకట్టను వీక్షించాను. అలాంటి కవర్లు మన దేశంలో ఎప్పుడూ చూడలేదు. ఎంత అందంగా వున్నాయని! ఆ కట్టకు పైనున్న కవరుమీద మాబామ్మగారి పేరు వ్రాయబడివుంది. లోపలి కవర్లపై కూడ యిలాగే చిరునామా వుండివుంటుందని భావించాను. తాతయ్యకు ఆమె వ్రాసే ఉత్తరాలన్నీ మా బామ్మగారి పేరనే వ్రాయడంవల్ల ఆమెకు శ్రేయస్కర మవుతున్న దేమో ననుకున్నాను. కాని యిలాంటి స్వల్ప విషయాలను గురించి వివరించమని ఎలా కోరగలను ?

నేను కొంచెంసేపు ఏమీ మాట్లాడలేక కూర్చున్నాను. మా తాతయ్యే అడిగాడు. "ఏం బాబూ, ఎలా వున్నాయిరా ఉత్తరాలు ?" అని—

" చాలా అద్భుతంగా వున్నాయి తాతయ్యా ! నీవు వ్రాసిన ఉత్తరాలకు కాపీలు ఉంచుకోలేదా? " అన్నాను.

"లేదురా, బాబూ ! ఒకటో రెండో ఉత్తరాల్కి-ప్రతులువ్రాసి వుంచాను. అయినా అంత ఓపికేదిరా ?"

తాతయ్య ఈ మాటంటూ మళ్ళీ బీరువా దగ్గరకు వెళ్ళాడు. తను వ్రాసి వుంచుకున్న ప్రతులు తెస్తున్నాడు కాబోలు ! కాని బీరువా దగ్గర్నుంచి తిరిగివస్తూ చేతిలో హారతి కర్పూరం దండ తెచ్చాడు. ఎందుకో తెలియదు. "ఇదిగో

చూడు! ఈ దండ ఆవిడ ఫోటోకి వేసి ఒక నమస్కారంచేయి! అన్నాడు. గోడనున్న మిస్ డెయిజీ ఫోటోను వేలుతో చూపాడు. కన్నులు ప్రశాంతంగా ఆమెవెంపుకు త్రిప్పాడు.

నేను వెంటనే హృదయపూర్వకంగా ఆ దండ తీసుకున్నాను. కుర్చీపై ఎక్కి ఆమె ఫోటోకి దండవేస్తూ పరిశీలించి ఆమెను చూశాను. ఆఫోటోకి అప్పటికప్పుడే సువాసనల జిమ్ముతున్న ఎర్రగులాబీపూల మాల వేయబడివుంది. ఆ అలంకరణతో మిస్. డెయిజీ కేవల సజీవమూర్తిగా నా కన్నులముందు సాక్షాత్కరించింది. పల్చని బుగ్గలూ, విశాలమైన నుదురూ, కలలు కంటున్నట్టుగా దూరాలను స్పర్శించే విశాలమైన నేత్రాలూ... ఆ ఫోటోనుచూడ్డం ఇదే మొదటి సారికాదు. కాని సజీవ సాక్షాత్కారం కావడం ఇదే మొదటి సారి! నా చేతిలోని దండ వేశాను. ఆమె నిర్మలహృదయానికి స్వచ్ఛ ప్రణయంతో ప్రకాశించే నేత్రాలకు మనసారా కైమోడ్పులు చేశాను. ఎందుకో నాకే తెలియదు నా కన్నులుకూడ చెమ్మగిల్లాయి. యథాస్థానంలో కూర్చున్నాను.

మా తాతయ్య నా ముఖాన్ని సాదరంగా పరిశీలిస్తున్నాడు. నేను మౌనంగా ఆలోచించుకుంటున్నాను. 1940 తర్వాత ఆమె ఎందువల్ల ఉత్తరాలు రాయులేదో? రాసివుంటే అదే చివరి ఉత్తరమనడం ఎలాగ? సందేహనివృత్తికోసం

ఆమె రాయకపోవడానికి కారణమేమిటో తాతయ్యా నడిగాను. ఆనాటినుంచి ఆమె క్షేమ సమాచారాలేమీ తెలియటంలేదట! అంతకుపూర్వం రెండుసార్లు తాతయ్య అమెరికా వెళ్ళాడు. ఈమాటుకూడా ఆమె సంగతులు తెలుసుకోవాలంటే అక్కడికే వెళ్ళాలి తప్ప మరోమార్గంలేదు. కాని ఈ వయసులో తనకా ఓపిక ఎక్కడుంది? డెబ్భయినాలుగేళ్ళ వయస్సువాడు!

కాని నా కొక్కటే సందేహం. ప్రేమామృతాన్ని యింతగా రుచిచూసిన తాతయ్యే సరోజ విషయంలో ఎందుకలాంటి అభిప్రాయమిచ్చాడా అని!

ఆయనన్నాడు కదా; "మనమెంత క్రిస్టియన్లమైనా— బ్రాహ్మణకులంనుంచి క్రిస్టియన్లుగా మారినవారితోనే వివాహ సంబంధాలు చేసుకోవాలిగాని— లేకపోతే మనసులు కలవవురా అబ్బీ!... ఇది నా అభిప్రాయమనుకో! నేను చెప్పినట్టే నీవు నడచుకోవాలని నేనేమీ శాసించలేను. నీ యిష్టంవచ్చినట్లే చేయవచ్చు...నా ఉద్దేశంమాత్రం నీతో చెప్పాను."

అంటూ తాతయ్య ఎంతో నెమ్మదిగా చెప్పాడు. నా ఇష్టంవచ్చినట్లే చేసుకోమన్నాడు. కాని ఆయనకిష్టంలేని నా యిష్టాన్ని ఆచరించడం మాత్రం నాకు సాధ్యంకావడం లేదు. నాకా ధైర్యం ఎక్కడుంది ? అతను క్రూరంగా శాసించినట్లయితేనే ఎంతో బాగుండిపోను. ఆయనంత ఆప్యాయంగా

చెప్పడంవల్లనే నాకేంచేయాలోకూడా తోచకుండా చేయ గలిగాను.

తాతయ్య చెప్పినట్టే తానంత క్రిస్టియనైనా బ్రాహ్మణ సంస్కారాన్ని పోగొట్టుకోనలేక పోయాడు. తనకిగాని, మా కుటుంబంలో మరెవ్వరికిగాని మాంసభక్షణం నిర్బంధం కాక పోయినా నిషిద్ధం మాత్రం కాదు. పైగా తనకి మద్య మాంసా లంటే ప్రీతికూడా వుంది. కాని మా నాన్న వివాహ సంద ర్భంలోగాని, మా మేనత్త వివాహ విషయంలోగాని మా తాతయ్య తాను చెప్పిందే ఆచరణలో పెట్టాడు. దేశమంతా గాలించి బ్రాహ్మణ క్రిస్టియన్లతోటే సంబంధాలు చేశాడు. కనకనే మా అమ్మగారి పుట్టింటివారు ఒరియా బ్రాహ్మణ క్రిస్టియనులు! నావిషయంలోకూడా అదే జరగాలని మా తాతయ్య కోరిక!

కాని, తన ప్రియురాలు మాత్రం తనకులం కాదు, సత్రీ కాదో, తన దేశంకూడా కాదే. ఖండాంతర నాగరిక జాతికి సంబంధించిన ఆమె కదా! మరి ఆమెనంత ప్రాణప్రదంగా ఎందుకు యింతకాలంగా ప్రేమిస్తున్నాడో! మనస్సులో అను కొన్నానేకాని ఈ ప్రశ్న వేసే ధైర్యం నాకులేదు. అతని అంగీకారముద్ర పొందని ఏపనీ చేయలేను. కనుకనే "భగవం తుడా, మా తాతయ్య బ్రతికివుండగా నాకు పెళ్ళిచేసుకునే

యోగ్యత లేదా ?'' అని నన్ను చూసి నేనే జాలిపడుతూ, కాలం గడుపుతున్నాను.

మా తాతయ్య జీవితంలో నిత్యమూ మెరిసే సువర్ణ కాంతుల గురించి ఎంతైనా చెప్పవలసివుంది. కాని ఎన్ని విష యాలని చెప్పగలను ? కనక ఒక్కటే విషయం చెప్పి ముగిస్తాను.

ఆవేళ మా తాతయ్య చాలా ఉత్సాహంగావున్నాడు. యథావిధిగా అభ్యంగనస్నానం చేశాడు. పాము కుబుసంలా మెరిసే కొత్త బట్టలు కట్టుకున్నాడు. ఇంట్లో పిల్ల పిల్ల పర్యంతం పేరు పేరునా పిలిచాడు. అందరికి తానివ్వవలసిన బహుమతు లిచ్చేసాడు. చాలా హుషారుగా వున్నాడు. ఆవేళ శ్రావణ పౌర్ణమి. ఆవేళ—డెబ్బయ్యేదో జన్మదినోత్సం వేడుకగా జరుపుకుంటున్నాడు. స్నేహితుల్నీ, బంధువుల్నీ అందర్నీ డిన్నర్‌కి పిల్చాడు. మధ్యాహ్నం అవుతోంది. రావలసిన వారంతా ఒక్కొక్కరే వస్తున్నారు. ఇక భోజనాలకు లేస్తా మనగా మా తాతయ్య స్నేహితుడొకాయన కలకత్తానుంచి వచ్చాడు. వస్తూ విస్కీబాటిల్ తెచ్చి ఆయనకి బహూకరిం చాడు. మరచిపోకుండా తెచ్చినందుకాయన్ని తాతయ్యెంతో ఆప్యాయంగా అభినందించాడు. సీసాను చేత్తో పుచ్చుకొని గుండెలకు ఆలింగనం చేసుకున్నాడు. హాయిగా ముద్దుపెట్టు

కున్నాడు. ప్రేమగా మునివేళ్ళతో సీసాను నిమిరాడు. వెంటనే గ్లాసు తెచ్చిపెట్టమని నాతో చెప్పాడు. ఒకటి రెండౌన్సులు పోసుకుని తాగేశాడు... ఏ వస్తువుమీదనైనా ఆయనకెంత అనురక్తి వుంటుందో— అంతే విరక్తీ వుంటుంది. విస్కీ—అంటే అంత ఇష్టమైనా— ఒకటి రెండౌన్సుల మోతాదుకంటె ఎప్పుడు ఎక్కువ పుచ్చుకోడు.

ఆనాడెంతో ఆనందంగా గడిచిపోయింది. ఉదయంనుంచీ ముసురు ముసురుగావుంది. చినుకు గాలీ ... పెద్దవర్షముంటే లేదుకాని వాతావరణం తుఫాను సూచనగా వుంది. భోజనా లయ్యాయి. మిత్రులందరూ మా తాతయ్య నుంచి సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు. ఆయన తనగదిలో పడుకొని నిద్ర పోయాడు. నేను నా గదిలో కూర్చుని ఏదో చదువుకుంటు న్నాను. హఠాత్తుగా తాతయ్య పిలుపు వినిపించింది. జాగ్రత్తగా విన్నాను ; "ఒరే బాబూ!...రమా!" అని నన్నే తాతయ్య పిలిచాడు. వెంటనే వెళ్ళాను. "ముసురు తగ్గిందా" అని అడిగాడు. ఇంకా లేదని చెప్పాను. ముసురు తగ్గగానే ఎక్కడికేనా వెడదామనుకున్నాడో ఏమో పాపం! "అయితే రాత్రి వెన్నెల కనిపించదు కాబోలురా।" అన్నాడు. అప్పుడు కాని తాతయ్య రాత్రి వెన్నెల గురించి ఆలోచిస్తున్నట్టు తెలియనే లేదు.

"సరే కాని యిలారా!" అన్నాడు తాతయ్య. దగ్గరకు వెళ్ళి ఏం చెబుతాడోనని చూస్తూ నించున్నాను. బీరువా తీసి చిన్ని గంధపు పెట్టెలోంచి నూరు రూపాయల కాగితం తీసాడు. దాన్ని నా చేతిలో పెట్టాడు. ఎందుకోనని పుచ్చుకున్నాను. "ఇదిగో దీన్ని నువ్వు తీసుకొని నీ యిష్టం వచ్చింది కొనుక్కోరా బాబూ! ఏది కొనుక్కున్నా నన్ను చాలాకాలం జ్ఞాపకం చేసేది కొనుక్కో" అన్నాడు. నేనాశ్చర్యపోయాను. "ఇదేమిటి తాతయ్యా! ఇప్పుడెందుకిదీ?" అన్నాను. "అలా కాదు. ఇప్పుడే వెళ్ళి కొనుక్కోవాలి. నామాట కాదనకు!" అన్నాడు తాతయ్య. ఎందుకో నా కన్నుల్లో నీరు తిరిగింది. తాతయ్యమాట కాదనలేకపోయాను.

అదృష్టవశాత్తూ సాయంత్రమయ్యేసరికి తుఫాను వాతావరణం తగ్గింది. మబ్బులు చీలిపోతున్నాయి. ఎనిమిది గంటలయ్యేసరికి ఆకాశంనిండా వెన్నెల విరియబూసింది. భోజనాలు కాగానే అందరమూ హాల్లో కూర్చున్నాం. నేనానాటి పేపరు చదువుతున్నాను. వీధివాకిట్లో పది నిమిషాలు పచార్లు చేసి వచ్చాడు తాతయ్య! శీర్షికలు వినిపించమన్నాడు. వినిపిస్తున్నాను. "ప్రభుత్వ కార్యకలాపాలు మందకొడిగా సాగడం గురించి నాయకుల తీవ్ర విమర్శ" అన్నది చదివి వినిపించాను. వెంటనే తాతయ్య తన వ్యాఖ్య విసిరాడు; "ఆ...వీళ్ళ మొహం! వీళ్ళకి పరిపాలనకూడా తెలుసూ? లంచగొండి

తనాన్ని వీళ్ళరికట్టగలరా? ఏమిటో డాబులు?" అన్నాడు.

మన ప్రభుత్వాలు ఉండవలసినంత ప్రజానుకూలంగానూ, సాగవలసినంత చురుకుగానూ, ఉండటం లేదని నా వంటివాళ్ళు కూడ అప్పుడప్పుడు విమర్శిస్తున్నదే! కనక అదే ధోరణిలోనే తాతయ్యకూడా విమర్శిస్తున్నాడనుకొన్నాను. ఊకొట్టాను. ఆయన మళ్ళీ ప్రారంభించాడు; "ఇంగ్లీషువాళ్ళ కంటె వీళ్ళేం పొడబొడిచారురా? వాళ్ళకి పరిపాలనంటే తెలుసు! వీళ్ళకేం తెలుసు?...వీళ్ళ మొహం! సంతకాలూ, ఉపన్యాసాలూ తప్ప!" అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. ఇంకా మా తాతయ్యకి ఆంగ్ల ప్రభుత్వంమీద మక్కువ పోలేదేమా? అని ప్రశ్నించుకున్నాను. నాకు మనస్సుమాత్రం కలుక్కుమంది.

ఏమైతేనేం మా తాతయ్య మాత్రం మహానుభావుడు. 1876 వ సంవత్సరంలో జన్మించి డెబ్బై అయిదేళ్ళ పూర్ణాయుర్దాయంతో జీవితమంతా ఒక్కఫాయిగా గడిపిన మహనీయుడు. రెండు శతాబ్దాల సాంఘిక చరిత్రకి ప్రాతినిధ్యం వహించినవాడు! గడుస్తున్న కాలంతోపాటు, తానూ కదలినవాడు; కరగి నీరైనవాడు, గడ్డ కట్టినవాడు! కనకనే మా తాతయ్య... నడుస్తున్న కాలచక్రానికి నేమి వంటి వాడనడానికి నా కెన్నో ఆధారాలున్నాయి!

[ఆనందవాణి వికాస సంచిక – మే, జూన్ 1959]